ఘనంగా ప్రపంచ ఎన్‌జీవో దినోత్సవం



ఎన్‌జీవోలను సన్మానిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో గురువారం ప్రపంచ ఎన్‌జీవో డే ను ఘనంగా నిర్వహించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంస్థ అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యావరణవేత్త కోలా రవీందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో పెను ముప్పు పొంచి ఉందని, ప్రత్యామ్నాయ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మీడియేటర్ మాణిక్యరెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న పలువురు ఎన్‌జీవోలను సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్‌గౌడ్, విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు తాతాజీ, మనం ఫౌండేషన్ ప్రతినిధి శ్యామ్, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం ముత్తోజు వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంస్థ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

కమిషనర్ వెంకటేశ్వరనాయక్

దుండిగల్: పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధి సహకరించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో ఆస్తి పన్ను వసూలు పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ ప్రాపర్టీలను వెంటనే గుర్తించి ఆస్తి పన్ను విధించాలని, అదే విధంగా ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయడంతో పాటు కొత్త వారికి లైసెన్స్‌లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.



ఆస్తి పన్ను వసూళ్ల వివరాలు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరనాయక్

బూస్టర్‌పంపు ఏర్పాటుతో నీటి ఎద్దడికి పరిష్కారం



బూస్టర్ పంపు ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీజీఎం రాజేష్ తదితరులు

చింతల్: జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడి పరిష్కారానికి అధికారులు ముందడుగు వేశారు. వైష్ణవి ఎన్‌క్లేవ్, పేట్ బషీరాబాద్, రంగారెడ్డి బండ, యాదిరెడ్డి బండ, ఫుడ్స్ కాలనీ తదితర ప్రాంతాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌కు బూస్టర్ పంపు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చింతల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేష్, సెక్షన్ మేనేజర్లు శివప్రసాద్ రోహిణి, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్‌నాథ్‌లో కలిసి నేషనల్ హైవే రోడ్డు పక్కనే ఉన్న సెయింట్ ఆన్ హైస్కూల్ వెనకాల ఉన్న ఛాంబర్ వద్ద బూస్టర్ పంపు ఏర్పాటు చేసేందుకు గురువారం పరిశీలించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే బూస్టర్ పంపు బిగింపు ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. చుట్టుపక్కల బస్తీలు, కాలనీలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని డీజీఎం తెలిపారు.

ఘనంగా దేవాంగ కుటుంబ సమ్మేళనం

చింతల్: ఆర్థికంగా వెనుకబడిన దేవాంగ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలంగాణ దేవాంగ సంఘం అధ్యక్షుడు కోళ్ల వీరేష్, ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. గురువారం చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్ ప్రాంగణంలో దేవాంగ కుటుంబ సభ్యుల సమ్మేళనం నిర్వహించారు. శివపార్వతుల పూజ, భజన కార్యక్రమం, చిన్నారుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలతో సమ్మేళనం సందడిగా జరిగింది. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. తదనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోళ్ల వీరేష్, ప్రధాన కార్యదర్శి లోకేష్ తదితరులు

వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతల్: మానవసేవే మాధవసేవ అని ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆక్యుపంచరి డాక్టర్ రాధిక లేళ్ల అన్నారు. ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చింతల్ హెచ్‌ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఉచిత వైద్యం నిర్వహించారు. బీపీ, డయాబెటిస్ టెస్టులతో పాటు ఇతర పరీక్షలను నిర్వహించారు. అవసరమైన పేషెంట్లకు ఆక్యుపంచర్ చికిత్సలు అందజేసి, మందులను పంపిణీ చేశారు.



ఎట్టకేలకు సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఎందరో ఎదురు చూస్తున్న నిరీక్షణకు తెరపడింది. నాడు నిధులు సరిపోక టెండర్లను ఆహ్వానించినా పనులు దక్కించుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. రోడ్డు నిత్యం రద్దీగా ఉండటంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ పనుల కోసం స్థానికులు, వాహనదారులు ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వచ్చే వాహనాలు దూలపల్లి మీదుగా వస్తూ పోతున్నాయి. ఈ నిర్మాణం పూర్తైతే మరింత దగ్గర అయ్యే అవకాశం ఉంది.

ఎట్టకేలకు టెండర్ల ఆహ్వానం

- సుభాష్ నగర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూపులు
- రూ.56 కోట్ల నిధులతో ప్రణాళికలు
- రోడ్డు వెడల్పునకు అడ్డుగా వచ్చే నిర్మాణాలకు నోటీసులు

కుత్బుల్లాపూర్ : సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు నుంచి ఇటు రాష్ట్ర రహదారి నర్సాపూర్ అటు జాతీయ రహదారి 44కు అనుసంధానంగా ఉంటుంది. ఇటువైపుగా జీడిమెట్ల పారిశ్రామిక వాడకు సంబంధించిన భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కేవలం 15 ఫీట్ల వెడల్పుతో ఉన్న బ్రిడ్జి నిర్మాణం 60 ఫీట్ల వెడల్పుతో చేపట్టేందుకు 2018లో సికింద్రాబాద్ నార్త్ జోన్ అధికారులు రూ.2 కోట్ల నిధులతో ప్రణాళికలు రూపొందించి టెండర్లకు ఆహ్వానించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరుసార్లు టెండర్లు పిలిచిన ఏ ఒక్కరూ అక్కడ పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో అధికారులు చేతులెత్తేశారు. ఇంతలో నార్త్ జోన్ నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ కూకట్‌పల్లి జోన్‌కు బదలాయించడంతో 7 సంవత్సరాలుగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

టెండర్లను ఆహ్వానించాం

సుభాష్ నగర్ పైపు లైన్ రోడ్డు స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచాం. సుమారు రూ.56 కోట్లతో చేపట్టనున్న ఈ బ్రిడ్జి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. అక్కడ విద్యుత్ స్తంభాలతో పాటు డ్రైనేజీ పైపులు వేయాల్సి ఉంది. వాటిని ఇతర విభాగం అధికారులతో చర్చించి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

–వెంకటరమణ, ప్రాజెక్టు డిప్యూటీ ఇంజినీర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

రూ.56 కోట్లతో టెండర్లు

నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు వెడల్పునకు కూకట్‌పల్లి జోనల్ అధికారులు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులతో చర్చించారు. రోడ్డు వెడల్పు, బ్రిడ్జి నిర్మాణం, నిధుల కేటాయింపు తదితర విషయాలపై మాట్లాడారు. సుమారు రూ.56 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. దీంతో పాటు షాపూర్ నగర్ రంగా భుజంగా థియేటర్ నుంచి దివాన్ దాబా జీడిమెట్ల వరకు 60 ఫీట్ల రోడ్డుకు సుమారు 113 నిర్మాణాలు అడ్డుగా వస్తున్నాయని అధికారులు గుర్తించారు. నోటీసులు జారీ చేసి గోడలకు మార్కింగ్ కూడా చేశారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బౌలింగ్ వేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్, 9వ ఫేజ్‌లోని గ్రౌండ్‌లో గురువారం తెలంగాణ జాగృతి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల ద్వారా పోటీతత్వం పెరిగి లక్ష్యం వైపు పరుగెడతారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్, గోపి, నారాయణరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్కులను పరిశీలించనున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో పర్యటించనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు మలేషియన్ టౌన్‌షిప్ వెనుక వైపు 5 ఎకరాల్లోని పార్కు పరిశీలన, రోజీరీ స్కూల్ ముందు ట్రయాంగిల్ పార్కు, 4వ ఫేజ్ బస్టాప్ థీమ్ పార్కు, బస్తీ దవాఖానా ముందు గల పార్కును పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఎమ్మెల్యే పర్యటనను విజయవంతంచేయాలని కోరారు.

ఘనంగా మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు



గొర్రెపోతుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలోని మల్లికార్జున స్వామి 54వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం, రుద్రస్వాహకార హోమం, మధ్యాహ్నం 12.30 గంటలకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4.30 గటలకు గొర్రెపోతుల రథోత్సవం, అగ్ని గుండం, 5 గంటలకు గొలుసులు తెంపుట, సాయంత్రం 6 గంటలకు అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వామి వారి నాగవెళ్లి, సాయంత్రం 4 గంటలకు కొండ పోచమ్మకు బోనాల సమర్పణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది.



విశేష అలంకరణలో మల్లికార్జున స్వామి అమ్మవార్లు

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న కొంపల్లి ప్రత్యేక అధికారి చంద్రమోహన్ తదితరులు

కుత్బుల్లాపూర్: ఆయా డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కొంపల్లి పురపాలక సంఘం ప్రత్యేకాధికారి చంద్రమోహన్ అన్నారు. వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ తదితర వాటి గురించి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ నరేష్, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్, మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కీసరగుట్టలో నాలుగో రోజుకు వేడుకలు
- భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజ
- రాత్రి వైభవంగా విమానరథోత్సవం



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు వేదపండితులు గురువారం ఉదయం స్వామి సన్నిధిలో గర్భాలయంలోని స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజ చేశారు. మరోవైపు ఆలయం పక్కన గల యాగశాల్లో టీటీడీ వేద పాఠశాల పండితులు గణపతిశర్మ, వేద విద్యార్థులతో కలిసి రుద్ర స్వాహాకార హోమాన్ని నిర్వహించారు. అలాగే సాముహిక అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి 8 తర్వాత కొండ దిగువన గల పార్క్ సమీపంలో స్వామివారికి విమాన రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ రథానికి పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్లతామర కొలను వరకు కొనసాగిన రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.



కీసరగుట్టలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

- స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కీసరగుట్టకు తరలివచ్చారు. స్వామిదర్శనానంతరం ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గల శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. కాగా మహాశివరాత్రి అర్ధరాత్రి లింగోద్భవకాలంలో గర్భగుడిలో స్వామివారికి వేద పండితులు వైభవంగా సంతతధారాభిషేకం చేశారు. ఆలయం ఎదురుగా శివలింగాలు ఉండడంతో భక్తులు కూడా పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేటి పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (శుక్రవారం) ఆలయంలో పలు పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నిమిషాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాముహిక అభిషేకాలు, (కల్యాణ మండపంలో) ఉదయం 7 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 7 కు ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు వసంతోత్సవం, పుష్పయాగం, పూజలు నిర్వహించనున్నారు.



యాగశాలలో కలశపూజ చేస్తున్న వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు

ముగిసిన శివరాత్రి వేడుకలు



సూరారం ఉమామహేశ్వర ఆలయంలో అన్నదానం



శివపురి కాలనీలో ..

- వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ఆలయాల వద్ద అన్నదానాలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బుధవారం రాత్రి జాగరణతో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



మల్లికార్జునస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు శేఖర్‌యాదవ్



జగద్గిరిగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : 33/11కేవీ అలీప్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ డాక్టర్ కాలనీ ఓహెచ్ ఫీడర్, 11కేవీ మధురానగర్ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు శిల్పా లే అవుట్ ప్రాంతం, డాలర్ హోమ్స్, కెనరా బ్యాంక్ ఏరియా, మోర్ సూపర్ మార్కెట్, అంబా భవానీ హోటల్, పోలిమెరాస్, సురక్ష హాస్పిటల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఫీడర్ల నిర్వహణ చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, వనమ్స్‌స్క్వేర్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్, హర్షా ఆసుపత్రి, డిమార్ట్ వెనుక గల్లీ, జేజే బాబు లేన్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

2న వైద్య శిబిరం

నిజాంపేట్ : ప్రగతినగర్, సుందరయ్య భవనం, మిథిలానగర్ కమాన్ దగ్గర మార్చి 2వ తేదీన ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పిక్సల్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9348581024 / 9247490627 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నిజాంపేట్ : నిజాంపేట్‌లోని సాయినాథుని ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం అత్యంత వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రస్ట్ సభ్యులు ఏనుగుల రాజశేఖర్‌రెడ్డి, ఏనుగుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి కృషి



హన్మంతరెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

నిజాంపేట్ : మసీదు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప మైనార్టీలు రంజాన్ మొదలవుతున్న సందర్భంగా మసీదు అభివృద్ధిపై గురువారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి చర్చించారు. అనంతరం ఆయనను సన్మానించారు. మసీదులో సౌకర్యాలు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానని హన్మంతరెడ్డి హామీ ఇచ్చినట్లు మైనార్టీలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంసీ మైనార్టీ అధ్యక్షులు అంజద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం



కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి గాజులరామారానికి నిత్యం నడిచే ఆటోలు ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్తున్నాయి. ముందు సీట్లో డ్రైవర్ పక్కన అటు ఇద్దరూ ఇటు ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు కలిసి వెళ్తున్నా సంబంధిత జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. నిత్యం ఎక్కడో ఒకచోట ఆపి ట్రాఫిక్ చలానా పేరుతో తనిఖీలు చేపట్టే ట్రాఫిక్ పోలీసులు వీటిని కట్టడి చేయలేకపోవడం విశేషం.

3నుంచి అందుబాటులోకి ఓయూ స్విమ్మింగ్ పూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 3 నుంచి స్విమ్మింగ్‌పూల్ అందుబాటులో ఉంటుందని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల కుటుంబాలు వినియోగించుకోవచ్చువన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులు స్విమ్మింగ్‌పూల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

హెచ్‌సీయూ ఎంఎంటీటీసీ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ప్రొ.వెంకటరమణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఇన్‌చార్జీ డైరెక్టర్‌గా సీనియర్ ప్రొఫెసర్ వి వెంకటరమణ నియమితులయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఎంఎంటీటీసీ ద్వారా ఉపాధ్యాయులు/అధ్యాపకుల సామర్థ్యాన్ని శిక్షణ ద్వారా పెంపొందించడానికి పనిచేస్తుంది. బోధన, పరిశోధన, ప్రచురణలు, పేటెంట్లు, సంస్థాగత అభివృద్ధిలో భారతీయ విలువలను పెంపొందించడంమే లక్ష్యంగా ఈ మిషన్ పని చేస్తుంది.